క్లుప్తంగా

రచయిత అజీజ్ కథా సంపుటి ఆవిష్కరణ



అజీజ్ కథా సంపుటిని ఆవిష్కరిస్తున్న తటవర్తి త్రినాథరావు తదితరులు

మహారాణిపేట: విశాలాంధ్ర పుస్తక ప్రదర్శన ప్రాంగణంలో కర్నూలుకు చెందిన ఎస్.డి.వి. అజీజ్ రచించిన కథా సంపుటి 'అజీజ్ కథలు' పుస్తకావిష్కరణ గురువారం జరిగింది. అభ్యుదయ రచయితల సంఘం కార్యదర్శి ఉప్పల అప్పలరాజు అధ్యక్షత వహించారు. యూఎస్ఏకు చెందిన ప్రసిద్ధ సాహితీవేత్త తటవర్తి త్రినాథ నాగేశ్వరరావు కథా సంపుటిని ఆవిష్కరించారు. ఎస్. హనుమంతరావు కథలను సమీక్షించారు. అనంతరం కథా సాహిత్యంపై విభిన్న కోణాల్లో చర్చ జరిగింది. డాక్టర్ డీవీ సూర్యారావు, ఆచార్య వి. సిమ్మన్న, మేడా మస్తాన్‌రెడ్డి, శిరేల సన్యాసిరావు, అడపా రామకృష్ణ, వి. నాంచారయ్య, బసు పోతన చర్చలో పాల్గొన్నారు. పలువురు కవులు, రచయితలు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సన్‌మూర్తి

డాబాగార్డెన్స్: దేవీ సుస్వరాలు సంగీత సంస్థ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. సోషల్ మీడియా స్టేట్ చైర్మన్ సన్‌మూర్తి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు శ్రీదేవి నిర్వహణలో నిర్వహించిన సంగీత విభావరిలో అలనాటి ఆణి ముత్యాలను నగరానికి చెందిన గాయనీ గాయకులు ఆలపించారు. హుషారైన యుగళ గీతాలతో కళాకారులు తమ ప్రతిభ ప్రదర్శించారు. విభావరిలో గాయనీ గాయకులు అమ్మాజీరావు, ఎన్‌వీఆర్ మూర్తి, సింగ్, సూర్యప్రకాష్, జగన్మోహన్, అరుణకుమార్, పద్మనాభం, భాగ్యలక్ష్మి, మాధురి, మను, పావని, సుజాత, రంజిత, రమణి యాంకర్ లక్ష్మీ స్వరూప, ఆక్వా కన్సల్టెంట్ జి. త్యాగరాజు, లోకేష్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

స్వస్థలానికి ఒడిశా కార్మికుడు



వసతి గృహంలో ఒడిశా వాసి ప్రశాంత్‌కుమార్ నాయక్

సీతమ్మధార: కాంట్రాక్టర్ వేధింపులకు గురైన ఒక కార్మికుడిని ఒడిశా పంపేందుకు సన్నాహాలు చేస్తున్నామని ఏయూటీడీ ప్రతినిధి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఒడిశాలోని కటక్‌కు చెందిన ప్రశాంత్ కుమార్ నాయక్ సిమెంట్ పని కోసం వైజాగ్ వచ్చాడు. ఒక చోట పనికి కుదిరాడు. పని చేశాక డబ్బులు అడిగినందుకు కాంట్రాక్టర్ అతన్ని కొట్టి మొబైల్ ఫోన్ తీసుకున్నాడు. చేసేది లేక ప్రశాంత్ కుమార్ నాయక్ ఎంవీపీ కాలనీలో ఉండగా ఆ ప్రాంతంలో నైట్ రౌండ్స్‌లో ఉన్న స్టేషన్ పోలీసు ఐ. అప్పలరాజు ఇతర సిబ్బంది అతని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అతన్ని ద్వారకానగర్ టీఎస్ఆర్ కాంప్లెక్సులో గల జీవీఎంసీ-ఏయూటీడీ షెల్టర్‌కు పంపించారు. ప్రశాంత్ కుమార్ నాయక్‌కు జీతం ఇవ్వకుండా, మొబైల్ ఫోన్ తీసుకున్న కాంట్రాక్టర్‌ను పిలిపించి సమస్య పరిష్కరించారు. ప్రశాంత్ కుమార్ నాయక్‌ను అతని ఊరు పంపించే ప్రయత్నం జరుగుతుందని ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు.

సమస్యల తిష్ట..

ఇదీ వార్డు తీరు..

ప్రాంతం : జీవీఎంసీ 35వ వార్డు
జనాభా : 21 వేలకి పైగా
వీధులు : ప్రసాద్‌గార్డెన్స్, పండావీధి, నూనెమిల్లువీధి, పువ్వులసందు, దుర్గమాంబ సమాజం, కల్లుపాకలు, స్ప్రింగ్‌రోడ్డు, గాజులవీధి, బౌడారారోడ్డు, వెలంపేట
ప్రధాన సమస్యలు : యూజీడీలు, కాలువలు శుభ్రం చేయకపోవడం, వీధుల్లో రోడ్ల ఆక్రమణలు

ఆ వీధుల్లో రోడ్లన్నీ 30 అడుగులే. రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా వస్తే తప్పించుకోలేని పరిస్థితి. రహదారి అంతా అడ్డదిడ్డంగా వాహనాలు, టిఫిన్ బళ్లు, రాకపోకలకు అడ్డంగా స్క్రాప్ సామగ్రి, ఆటోలు, వాహనాల పార్కింగ్.. ఇలా ఒక్కటేమిటి ఆ దారిలో రోడ్డు మీద ఎన్నో కనిపిస్తాయి. అడిగితే తగాదాలు.. అడగకపోతే గంటల పాటు నిరీక్షణ. వీటికి తోడు అన్‌లోడింగ్ పేరుతో పన్నెండు చక్రాల వాహనాలు, రోడ్లపైనే క్యాటరింగ్ వంటకాలతో ఎవరికైనా బాగులేక ఏ అంబులెన్సో రావాలన్నా రాలేని దుర్భర స్థితిలో 35వ **వార్డులోని అనేక ప్రాంతాలు ఉన్నాయి.**



గాజులవీధిలో ఇళ్ల మధ్య శుభ్రం చేయని మురుగు కాలువ



స్క్రాప్ దుకాణాలతో గజిబిజి

- జీవీఎంసీ 35వ వార్డులో **కాలువలు** ఫుల్.. పారిశుధ్యం నిల్
- దోమలతో స్థానికుల **ఇక్కట్లు**
- క్యాటరింగ్ వంటకాలు.. స్క్రాప్ దుకాణాలతో ఇరుగ్గా వీధులు
- ఉండలేకపోతున్నామని ప్రజల గగ్గోలు



ఆక్రమణలు, అనధికార పార్కింగ్‌లతో ఇరుగ్గా మారిన పండా వీధి

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డులో ఆక్రమణలు తొలగించాల్సిన అధికార యంత్రాంగం కనిపించడం లేదని స్థానికులు వాపోతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సెల్లార్లలో దుకాణాలు నిర్మించకూడదు. కానీ టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు పట్టించుకోకపోవడం వల్ల ఇక్కడ సెల్లార్లలో దుకాణాలు ఏర్పాటు చేసుకుని పై అంతస్తులపై రెసిడెన్షియల్ నిర్మాణాలు చేసుకుంటున్నారు. దీని వల్ల రోడ్లపై వాహనాలు అడ్డదిడ్డంగా పార్కింగ్ చేయడం వల్ల స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.

మురుగు కాలువలు.. దోమలతో ఇక్కట్లు..

ఈ వార్డులో చాలా మురికి వాడలు ఉన్నాయి. ఇక్కడ రెండిళ్లకు మధ్య కేవలం అడుగున్నర దూరం మాత్రమే ఉంటుంది. ఇందులోనే వాడుకునే నీరు పోవడానికి అర అడుగు మురుగు కాలువ ఉంటుంది. జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది ఇంటింటికీ వచ్చి చెత్త సేకరిస్తున్నారు తప్ప ఇంటి ముందున్న కాలువలు శుభ్రం చేయకపోవడంతో అపారిశుధ్యం నెలకొని దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ప్రధాన రహదారులు, గెడ్డలు, రహదారి పక్కన ఉండే కాలువలు శుభ్రం చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది వీధుల్లోని ఇళ్ల ముందున్న కాలువల వైపు కన్నెత్తి చూడడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కల్లుపాకలు, గాజులవీధిలో సుమారు నాలుగు వందల గడపలో అయిదు వేల మందికి పైగా నివసిస్తున్నారు. కానీ ఏనాడూ ఇక్కడ కాలువలు కానీ, యూజీడీ కానీ శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన, దోమలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీని వల్ల వ్యాధులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాధుల సీజన్‌లో ప్రతి ఇంట్లో వ్యాధిగ్రస్తులు ఉంటున్నారని చెబుతున్నారు.

ఇళ్లలో ఉండలేకపోతున్నాం..

గాజుల వీధిలో కాలువలు, నూనెమిల్లు వీధిలో ఆటో స్టాండ్ పేరిట ఆక్రమణలు, పండావీధిలో భారీ స్క్రాప్ వాహనాలు, క్యాటరింగ్ వంటకాలు, అక్కడే గ్యాస్ సిలిండర్లతో అంతా రణగొణ ధ్వనితో భయం భయంగా గడుపుతున్నామని స్థానికులు చెబుతున్నారు. పండా వీధిలో స్క్రాప్ దుకాణాల వద్దకు భారీ వాహనాలు వస్తుంటాయని.. అవి ఎక్కడ ఇళ్ల పైకి వచ్చేస్తాయో అని భయంతో జీవిస్తున్నట్లు అక్కడి వారు పేర్కొంటున్నారు. దీంతో పాటు గ్యాస్ కటింగ్ వల్ల వచ్చే మంటల వల్ల ఎప్పుడే ప్రమాదం సంభవిస్తుందోనని భయపడుతున్నట్లు తెలిపారు. గతంలో ఇలాగే గ్యాస్ నుంచి మంటలు చెలరేగడంతో చుట్టుపక్కల వారు భయంతో పరుగులు తీశారని.. అదృష్టవశాత్తు అప్పుడు ఏం కాలేదని తెలిపారు. ఏది ఏమైనా 35వ వార్డులోని పలు ప్రాంతాల్లో అలుముకున్న ఈ సమస్యలను అధికారులు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..



వార్డులో అలుముకున్న సమస్యలను పరిష్కరిస్తాం. వీధుల్లోని ఇళ్ల ముందర ఉన్న కాలువలు శుభ్రం చేసేలా పారిశుధ్య సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తాం. రోజుకు ఒక వీధిలో కాలువలు శుభ్రం చేసే విధంగా చర్యలు తీసుకుంటాం. ప్రజలు కూడా ఏ వీధులు బాగులేవో ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసుకోవచ్చు.

–ఎం. మల్లయ్యనాయుడు, జెడ్సీ, జీవీఎంసీ జోన్-4

స్వామి వివేకానంద సంస్థలో ఉచిత వైద్య సేవలు



వైద్య శిబిరంలో రోగులను తనిఖీ చేస్తున్న డాక్టర్ సూర్యతేజ

డాబాగార్డెన్స్: ప్రతి నెలా రెండో గురువారం స్నేహ సంధ్య ఏజ్ కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థలో ఉచిత వైద్య సేవలు నిర్వహిస్తుంటారు. పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద ఎత్తున వైద్య శిబిరంలో పాల్గొని తనిఖీలు చేయించుకుంటారు. అందులో భాగంగా గురువారం డాక్టర్ సూర్యతేజ పలువురు పేదలు, వృద్ధులకు బీపీ, షుగర్ పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలికాలంలో తగిన వ్యాయామం చేయాలని, క్రమం తప్పకుండా మందులు వేసుకోవాలని, ఆహార నియమాలు పాటించాలన్నారు. క్రమశిక్షణతో జీవిస్తే ఆరోగ్యంగా ఉండొచ్చని తెలిపారు. వైద్య శిబిరంలో పుండరీకాక్షయ్య, ప్రసాద్‌నాయుడు, కమల ప్రియ, సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, పలువురు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సు నేడు

సీతమ్మధార : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రెవెన్యూ సదస్సులో భాగంగా ఏఎస్ఆర్ నగర్‌లో శుక్రవారం సదస్సు నిర్వహిస్తామని విశాఖ అర్బన్ తహసీల్దార్ ఎం.రమేష్ గురువారం 'సాక్షి'కి తెలిపారు. జీవీఎంసీ పరిధి 49వ వార్డు ఏఎస్ఆర్ నగర్‌లో గల సచివాలయంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సదస్సు జరుగుతుందన్నారు. సదస్సులో ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు పాల్గొంటారని తెలిపారు. సంబంధిత రెవెన్యూ వార్డు పరిధిలోని ప్రజలంతా భూ వివాదాలు, ఇతర సమస్యల మీద అర్జీలను అందజేయాలని ఆయన కోరారు.

కోనకు గద్దర్ జాతీయ సేవా పురస్కారం



పురస్కారంతో కోన ప్రకాష్‌ను సత్కరిస్తున్న తెలంగాణ సాంస్కృతిక సంస్థ ప్రతినిధులు

డాబాగార్డెన్స్: గద్దర్ జాతీయ సేవా పురస్కారాన్ని తెలంగాణ సాంస్కృతిక సంస్థ గురువారం డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో జైభీమ్ కన్వీనర్, అవంతి కంప్యూటర్స్ డైరెక్టర్ కోన ప్రకాష్‌కు అందజేసింది. తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథి, చైర్మన్ డాక్టర్ వెన్నెల గద్దర్ చేతుల మీదుగా పురస్కారం అందజేశారు. పేదలకు విద్యా, వైద్యం అందించాలని పరితపించి మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో మందికి సేవలందించడమే కాక అనేక మందికి ఉచితంగా కంప్యూటర్ శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించారు. ఉచిత రక్తదాన శిబిరాలు, కేన్సర్ అవగాహన సదస్సులు కోన ప్రకాష్ నిర్వహిస్తూ వస్తున్నారు. ఆయన సేవలను గుర్తించి సేవా పురస్కారంతో సత్కరించారు. కార్యక్రమంలో పి. గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, జైభీమ్ టీమ్ డాక్టర్ రమేష్‌బాబు, పాటల తూటా ఉదయ్‌భాస్కర్, గుండయ్య, కోన శంకర్, మురళి, జయరాజ్, ఈశ్వర్, గణేష్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి



నినాదాలు చేస్తున్న సీఐటీయూ నాయకులు

సీతమ్మధార: రాష్ట్రానికి ఏకైక భారీ పరిశ్రమ అయిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వి. కృష్ణారావు డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ పార్కు వద్ద జరుగుతున్న దీక్షా శిబిరంలో మద్దిలపాలెం జోన్ సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాం కంటే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే ప్లాంట్ ప్రభుత్వ రంగంలో కొనసాగుతుందా లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఈ ప్రభుత్వం వచ్చాక కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు, పర్మినెంట్ కార్మికులను వీఆర్ఎస్ పేరుతో బయటికి నెట్టేయడం జరుగుతుందన్నారు. జీవీఎంసీకి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు డివిడెంట్ల రూపంలో పన్నులు చెల్లిస్తున్న స్టీల్‌ప్లాంట్‌కి సొంత గనులు కేటాయిస్తే ఉత్తరాంధ్ర యువతకి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. తక్షణమే కూటమి ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ రక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ శిబిరంలో సీఐటీయూ సీనియర్ నాయకులు జీవీఎన్ చలపతి, కె. కుమారి, పి. విజయ, సూరప్పుడు, వీఎంఆర్డీఏ కార్మికులు రాంబాబు, నర్సింగ్‌రావు, చిన్నారావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర వేడుకకు జిల్లా వాసుల పయనం



పయనమవుతున్న పారిశ్రామికవేత్తలు తదితరులు

మహారాణిపేట: విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియం వేదికగా శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో జరగనున్న స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంటరీ ఆవిష్కరణలో భాగస్వామ్యమయ్యేందుకు గురువారం జిల్లా వాసులు బయలుదేరి వెళ్లారు. వివిధ విభాగాల అధికారులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, సామాజికవేత్తలు, ఎంఎస్ఎంఈ పరిశ్రమల నిర్వాహకులు, పారిశ్రామికవేత్తలు బస్సుల్లో పయనమై వెళ్లారు. సంబంధిత బస్సులను గురువారం మధ్యాహ్నం కలెక్టరేట్ వద్ద జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ జెండా ఊపి ప్రారంభించారు. విజన్ డాక్యుమెంటరీని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నెల 13వ తేదీ ఉదయం 10 గంటలకు ఇందిరా గాంధీ స్టేడియంలో ప్రజల సమక్షంలో ఆవిష్కరించనున్నారు. దీనిలో భాగస్వామ్యమయ్యేందుకు జిల్లా నుంచి వివిధ వర్గాల ప్రజలు సుమారు 300 మంది ఆరు ప్రత్యేక బస్సుల్లో విజయవాడ పయనమయ్యారు. రాత్రికి అక్కడికి చేరుకుని శుక్రవారం జరిగే స్వర్ణాంధ్ర వేడుకలో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో భవానీ శంకర్, సీపీవో శ్రీనివాసరావు, మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ కె.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ధనుర్మాసోత్సవాలకు ఏర్పాట్లు

మురళీనగర్ : మురళీనగర్ రామాలయంలో ధనుర్మాసోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్షుడు టి.నారాయణ రెడ్డి, కార్యదర్శి సనపల వరప్రసాద్ తెలిపారు. ఈ నెల 16న ఉదయం 5.30 గంటల నుంచి పొర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలతో ప్రారంభమై జనవరి 13న గోదా రంగనాథ స్వామి కల్యాణంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. ఈ సందర్భంగా రోజూ సీతారామచంద్ర స్వామికి తిరుప్పావై పాశుర విన్నపం, విశేష అర్చనలు నిర్వహిస్తామన్నారు.

16 నుంచి శ్రీలలితాపీఠంలో...

సీతంపేట : శ్రీలలితా పీఠంలో ఈ నెల 16 నుంచి జనవరి 13 వరకు ధనుర్మాస వ్రత మహోత్సవాలు నిర్వహించనున్నామని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధనుర్మాస వ్రతంలో భాగంగా పీఠంలోని శ్రీ భూ నీలా సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి సన్నిధిలో రోజూ నిత్య కైంకర్యం, విశేష సేవలు నిర్వహిస్తామన్నారు. ఉదయం 4 గంటలకు సుప్రభాతం, స్వామి, అమ్మవార్లకు అర్చన, బాలభోగ నివేదన, పాశురాల విన్నపం జరుగుతాయని తెలిపారు. విశేష పూజా కార్యక్రమాల్లో భాగంగా డిసెంబర్ 18న కుచేల దివసం, 24న ధూప పాశుర విశేషము, 26న ధన్వంతరి హోమం, 31న విశేష పాశురం, జనవరి 2న తిరుప్పావడ సేవ, జనవరి 3న సహస్ర దీపాలంకరణ, 10న వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం, జనవరి 11న కూడారై ఉత్సవం, 13న భోగి రోజున గోదా రంగనాయకుల కల్యాణం నిర్వహిస్తామని తెలిపారు.

అయ్యప్ప భక్తులకు మహాన్నదానం



అయ్యప్ప భక్తులకు అన్నప్రసాద వితరణ చేస్తున్న నిర్వాహకులు

డాబాగార్డెన్స్: పాతనగరంలోని అయ్యప్పస్వామి అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో అయ్యప్ప భక్తులకు మండలం రోజుల పాటు నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం గురువారంతో ముగిసింది. చివరి రోజు 1500 మంది అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. వన్‌టౌన్ శ్రీరామాలయం ధర్మకర్త నూలు సోమరాజు, కన్వీనర్ ఎన్‌వీజీ రావు, కో ఆర్డినేటర్ కందుల మూర్తి మాట్లాడుతూ ఈ మహాన్నదాన ప్రసాద వితరణ ఐదేళ్ల కిందట గురుస్వామి డీవీఎస్ మూర్తి ఆధ్వర్యంలో ప్రారంభించినట్లు తెలిపారు. ఆయన స్ఫూర్తితో ఈ సేవా కార్యక్రమం నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. ఇంటిగ్రల్ లాజిస్టిక్స్ అధినేత గ్రంధి రాజేష్, శ్రీనివాస కేటరింగ్ సహాయ సహకారాలతో గత నెల 2 నుంచి ఈ నెల 12 వరకు ప్రతిరోజూ 800 మంది అయ్యప్పలకు, చివరి రోజున 1500 మంది స్వాములకు ఈ అన్నప్రసాద వితరణ చేపట్టామన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో 78 మందికి ఉద్యోగాలు

మురళీనగర్ : ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 10, 11న నిర్వహించిన మెగా జాబ్ మేళాలో 78 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. జిల్లా ఉపాధి కల్పనాధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి (క్లరికల్), జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి టి.చాముండేశ్వరరావు పర్యవేక్షణలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ నెల 10న కంచరపాలెం పాలిటెక్నిక్ కాలేజీలో నిర్వహించిన జాబ్‌మేళాలో 40 మంది ఉద్యోగాలు సాధించారు. గాజువాకలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్‌లో 11న నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో ఫ్లూయెంట్ గ్రిడ్, గ్లాండ్ ఫార్మా, అపోలో ఫార్మసీ సంస్థలు నిర్వహించిన జాబ్ మేళాకు 120 మంది హాజరు కాగా 38 మంది ఉద్యోగాలు సాధించారు. స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ టి.లక్ష్మి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎం.రమేష్‌నాయుడు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

రేపటి నుంచి ఘంటసాల గానోత్సవం

మద్దిలపాలెం: అమర గాయకుడు ఘంటసాల 102వ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 14, 15 తేదీల్లో ఘంటసాల గానోత్సవం నిర్వహించనున్నట్లు ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు తెలిపారు. కార్యక్రమ పోస్టర్‌ను గురువారం శివాజీపాలెంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ చేతుల మీదుగా ఆవిష్కరించామన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 14, 15 తేదీల్లో సాయంత్రం 6 గంటలకు ఘంటసాల సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నామన్నారు. 14న ఎమ్మెల్యే వంశీకృష్ణ, సినీ నిర్మాత, ఉపకార్ ట్రస్ట్ అధినేత కంచర్ల అచ్యుతరావు, సినీ హీరో ఉపేంద్రబాబు, 15న నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, హైకోర్టు న్యాయవాది ఎస్.కె.మహంతి ముఖ్య అతిథులుగా హాజరవుతారని చెప్పారు. సోమేష్ సంగీత నిర్వహణలో జరిగే విభావరిలో గాయకులు ఘంటసాల గీతాలు ఆలపిస్తారన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తిరుమలరావు కోరారు. కార్యక్రమంలో కళారంగ ప్రముఖులు జి.త్యాగరాజన్, వీరేంద్ర యాదవ్, పిన్నింటి ఆదిమూర్తి పాల్గొన్నారు.

ముత్యాల వస్త్రాలంకరణలో కన్యకాపరమేశ్వరి



లక్ష్మీ గవ్వలతో విశేష పూజలు చేస్తున్న మహిళలు



ప్రత్యేక అలంకరణలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు

డాబాగార్డెన్స్: కురుపాం మార్కెట్ సమీపాన వెలసిన కన్యకాపరమేశ్వరి ఆలయంలో మార్గశిర ఉత్సవాల సందర్భంగా రెండో గురువారం కన్యకాపరమేశ్వరిని ముత్యాల వస్త్రాలంకరణలో అలంకరించారు. అమ్మవారి మూల విరాట్‌కు ప్రాత:కాల ప్రత్యేక పూజల అనంతరం 108 స్వర్ణాలతో పుష్పార్చన, లక్ష్మీదేవికి ప్రీతికరమైన లక్ష్మీ గవ్వలతో విశేష పూజలు జరిపారు. అనంతరం అమ్మవారికి రజత వస్త్రాలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. దేవాలయ ఆస్థాన మండపంలో ప్రధాన అర్చకుడు ఆర్‌బీబీ కుమార్ శర్మచే సామూహిక కుంకుమ పూజలు జరిపారు. దేవాలయ సంఘం అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, కార్యదర్శి పెనుగొండ కామరాజు మాట్లాడుతూ మార్గశిర మాసంలో వచ్చే గురువారాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించనున్నట్టు చెప్పారు. అలాగే సామూహిక కుంకుమ పూజలు నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు బాదం నాగవెంకట కమలశ్రీ, కట్టమూరి ప్రసన్న, కడిమిశెట్టి దంతేశ్వరి, గ్రంధి దేవి, పాలూరి స్వర్ణలత, కొల్లూరు విశాల, గ్రంధి ఉష, కందుల గీతా ఆదిలక్ష్మి, పసుమర్తి హైమావతి తదితరులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో క్రీడా సంబరాలు



విన్యాసాలు చేస్తున్న విద్యార్థులు



క్రీడలను ప్రారంభిస్తున్న ముఖ్య అతిథి సూర్యప్రతాప్

కంచరపాలెం: స్థానిక 104 ఏరియా కేంద్రీయ విద్యాలయం-1లో గురువారం 50వ వార్షికోత్సవం సందర్భంగా క్రీడలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విద్యాలయ మేనేజ్‌మెంట్ నామినీ చైర్మన్ కమాడోర్ సూర్యప్రతాప్, ప్రిన్సిపాల్ జి.కిషోర్ పాల్గొని క్రీడా వార్షికోత్సవ జ్యోతి వెలిగించారు. ఈ సందర్భంగా సూర్యప్రతాప్ మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో స్ఫూర్తి నింపి ఉత్సాహం, పోరాట పటిమను పెంపొందిస్తాయన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. ప్రిన్సిపాల్ కిషోర్ మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో పోరాట పటిమను ఇనుమడింపజేయడంతో పాటు శారీరక, మానసిక ఉల్లాసానికి, దేహదారుఢ్యానికి దోహదపడతాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు యోగా, కరాటే, బనానా రేస్, డ్రిల్ తదితర అంశాలు ప్రదర్శించారు. జాతీయ స్థాయిలో అండర్-14, అండర్-17లో హ్యాండ్ బాల్, బ్యాడ్మింటన్ క్రీడల్లో స్వర్ణ, రజత పతకాలు సాధించిన విజేతలకు ముఖ్య అతిథులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.